



# పదహారేళ్ళ వయసు

కె.వి.వి. సత్యనారాయణరాజు

ఒక విషయాన్ని అంచనా వేయడంలో మెదడుకున్న ప్రాముఖ్యతను కొట్టి పారవేయడానికి లేదు. కానీ అలా అంచనా వేయడానికి మెదడొక్కటే చాలదు. కొన్ని యితర అవయవాల సహాకారం కూడ దానికి అవసరం.

జ్యోతిని మొదటిసారి చూసినపుడు ఆమెకు ఇరవై ఏళ్ళుంటాయని అంచనా వేశాయి సురేంద్ర కళ్ళూ మెదడూ కలిపి. కానీ ఆ అమ్మాయి వయసు పదహారంటే పదహారే ఏళ్ళని లీలావతి చెప్పినపుడు తన తెలివితేటలమీద మొదటిసారిగా అపనమ్మకం కలిగిందతడికి.

లీలావతి సురేంద్ర ప్రియురాలు-రెండేళ్ళక్రితం. ఇప్పుడామె అతడి అర్ధాంగి.

తను చెప్పిన మాటలు విన్నాక భర్త మొహంలో వ్యక్తమైన ఆశ్చర్యం ఆమె కనుసన్నలు దాటిపోలేదు. అందుకే తెరిచిన అతడి నోటిని తన చేతివేళ్ళతో సుతారంగా మూస్తూ అందామె, "ఏం మీ కళ్ళకు నా కంటే ఎక్కువ వయసున్న దానిలా కనిపిస్తోందా జ్యోతి?"

సందిగ్ధంలో పడ్డాడు సురేంద్ర.

కాదంటే ఆమె చిన్నబుచ్చుకునే ప్రమాదం లేకపోలేదు. ఎందుకంటే తన

భార్యకు తన మీదున్న ప్రేమనతడు శంకించలేకపోయినా ఆమె పరిపూర్ణమైన ఆడదనే నమ్మకం అతడికుంది.

అలా అని అవునంటే అర్ధాంగి సంతోషిస్తుంది. ఆ విషయంలో ఆవగింజంతైనా అనుమానించవలసిందేమీ లేదు. కానీ అవునన్నాక ఆ విషయం అంతటితో ఆగిపోదు. ఎందుకు అవునో, చెప్పాల్సిన బాధ్యత కూడా తనమీద వుంటుంది.

పరాయి ఆడదాన్ని మరో మగవాడి ముందు వర్ణించడానికి తన కభ్యతరం లేదు. కానీ ఓ పెళ్ళికాని పిల్లను తన భార్యముందు, అందునా ప్రేమించి పెళ్ళి చేసుకున్న పడతి ముందు వర్ణించ చూడడం కొరివితో తల గోక్కోవడాని కేమాత్రమూ తీసిపోదు. అవుననీ కాదనీ చెప్పలేక వెర్రినవ్వు నవ్వాడు సురేంద్ర.

"అలా నవ్వుతారేం? వయసుకుమించి ఎదిగింది కదూ జ్యోతి?" అంది లీలావతి తిరిగి.

'ఊ' అనలేకపోయాడు సురేంద్ర.

'ఊ' అంటే వయసుకుమించి ఎదగడమంటే ఏవిటో చెప్పాల్సి వస్తుంది మరి! ఒకసారి అలా చెప్పాక— పోలీస్ స్టేషన్‌లో ఒకసారి పేరు నమోదు చేయించుకున్న చిల్లరదొంగకూ తనకూ తేడా ఉండదు.


"ఏమో నాకేం తెల్సూ? మొదటిసారి విన్న చూసీచూడ్డంతోనే నీ వెనక పడ్డాను. అంతే, అప్పట్నుంచీ ఈ రోజు వరకూ ఎదురుగా చీర కనబడితే చాలు, నా కళ్ళు మూతలు పడిపోతాయి." అంటూ కళ్ళనోసారి మూసి, తెరిచాడు సురేంద్ర అమాయకంగా.

తన భర్త రోజూ బజారు స్త్రీలతో తిరుగుతాడని తెలిసిన స్త్రీ కూడా భర్త అలా అంటే ఆనందించకుండా ఉండలేదు. ఇహ, క్లీన్ రికార్డ్ ఉన్న తన భర్త ఆ మాటలన్నపుడు ఆమె పరవశించిపోవడంలో వింతేముంది!

అయినా ఆ విషయం పైకి వ్యక్తపరిస్తే ఆమె పరిపూర్ణమైన స్త్రీ కానట్టే లెక్క. తన మనసులోని పరవశాన్ని పైకి వ్యక్తంకానీయకుండా, "కబుర్లు చెప్పకండి" అంటూ అక్కణ్నించి లేచి వెళ్ళిపోయింది లీలావతి, ఇంటిగల ఆవిడతో కబుర్లు చెప్పేందుకు. దీర్ఘంగా విశ్వసించడాని కప్పుడవకాశం దొరికిందతడికి.

జ్యోతి ఇంటిగలవారమ్మాయి. తా మా ఇంట్లోకి వచ్చిన మూడోరోజే జ్యోతి ప్రస్తావన తీసుకువచ్చింది లీలావతి. ఆ అమ్మాయికి పెళ్ళైపోయి ఉంటుందని భావించాడు సురేంద్ర, ఆమెను మొదటిసారి చూసినపుడు.

తన వూహకు భిన్నంగా ఆమె దేహం వయసుకుమించి ఎదిగిందనే విషయం ఆ రోజే తెలిసిందతడికి. అందుకే జ్యోతి వయసు పదహారేళ్ళని భార్య చెప్పినపుడు




అతడు ఆశ్చర్యపోయాడు.

పవిట కూడా సరిగ్గా వేసుకోవడం రాని జ్యోతికి ప్రతి నిముషమూ పవిట సరిగ్గా వేసుకోమని తల్లి చెప్పడం ఎక్కడ లేని చికాకు కలిగించేది మొదట్లో. కానీ తల్లి ఉద్బోధలు కలిగించిన చికాకును బజార్లో తారసపడే మగవాళ్ళామెనుంచి దూరం చేశారు.

సినిమాహాళ్ళ దగ్గరా, కాలేజీలోనూ మగవాళ్ళంతా తనవైపే గుచ్చి గుచ్చి చూస్తుండడానికి కారణం నిత్యమూ తల్లిచేసే హితబోధను తను లక్ష్యపెట్టక పోవడమే ననే విషయం ఆమె కర్థమైంది.

అప్పట్నుంచీ ఇంట్లో ఎలావున్నా బయటకు వెళ్ళినపుడు మాత్రం అందరాడవాళ్ళలానే మగాడెదురైనపుడల్లా ఆమె చేయి అప్రయత్నంగానే పవిట మీదకు వెళ్ళేది.

కానీ తమ పక్క పోర్షన్‌లోకి సురేంద్ర దంపతులొచ్చాక, స్వంతింట్లో కూడా తనిష్టం వచ్చినట్టు ఉండేందుకు వీలులేకపోవడం ఆమెకెంతో అశాంతిని కలిగించింది.

దానికి తోడు వాళ్ళిద్దరిదీ ప్రేమ పెళ్ళని తెలిసిన తరువాత, తనతల్లి తన కోసం చూసివుంచిన వరుడిలో అవలక్షణాలేమీ లేకపోయినా ఏమైనాసరే తనూ ఓ అందగాణ్ణి ప్రేమించి వాళ్ళిద్దరి కళ్ళముందే పెళ్ళిచేసుకుని తనేంటో తెలియజెప్పాలనిపించింది ఆమెకు.

ఆ వూహ మదిలోకి వచ్చాక, తనతో పాటే కాలేజీలో చదువుతోన్న వారిలో ముగ్గురు యువకులామెకు ప్రేమించదగ్గ వారుగా కనిపించారు. వారిలో తనక్కావలసిన వ్యక్తి నెలా ఎన్నుకోవాలో ఆమె కర్థంకాలేదు. పదిరోజులలా ముగ్గుర్నీ పరిశీలించాక కూడా ఎటూ తేల్చుకోలేక పోయిందామె.

కానీ ఒక రోజు ఆ ముగ్గురిలో ఒకడయిన కిషోర్ తనవద్దకు వచ్చి– "మీ ఎకనమిక్స్ నోట్ బుక్ ఓసారిస్తారా?" అని అమాయకంగా అడిగినపుడు తన

ప్రమేయం లేకుండానే అతడివైపు ఆకర్షింపబడిందామె. తరువాత ఆమె దగ్గర్నుంచి కనీసం రెండ్రోజులకోసారి ఏదో ఒక నోట్ బుక్ అడిగి తీసుకుని వెళ్ళేవాడతడు.

వారానికోసారైనా కాలేజీ కాంటీన్‌లో అతడితో కలిసి కాఫీ తాగేదామె. జ్యోతి కాఫీ తాగుతూంటే అతడామె దేహంలోని వంపుసొంపుల్ని కళ్ళతో తాగుతూ మెదడుతో కరకరా నమిలేసేవాడు.

కానీ ఆ రోజు పబ్లిక్ గార్డెన్‌లో మందార పొదప్రక్కన కూర్చొని కిషోర్ కోసం ఎదురుచూస్తోన్న జ్యోతికి అతడి గొంతు వినిపించడంతో చెవులు రిక్కించింది.

"ఇంకెంతలే మహా అయితే మరో వారంరోజులు. ఆల్‌మోస్ట్ లైన్‌లోకి వచ్చేసినట్టే అనుకో! కాకపోతే కొత్త పిట్ట కదా! బెదురు పోగొట్టడానికి మరి కొంచెం సమయం పడుతుంది. అలా వెధవ మొహాలు పెట్టకండి, నా తరువాతి ఛాన్స్ మీ ఇద్దరిదే!"

"ఎప్పటిలానే బొమ్మా, బొరుసూ వేసుకుని రెండో ఛాన్స్ ఎవరిదో తేల్చుకోండి... మరీ కంగారేమిట్రా బుద్ధా యిలా?... ఇప్పుడే తేల్చుకోవలసినంత అవసరం ఏం వొచ్చిందీ?...ఆ రూపాయి నీళ్ళ జేబులో పెట్టరా వెధవాయ్... ఐనా ఇంకా టైముందన్నానుగా! ఇక్కడ్నుంచి త్వరగా వెళ్ళండిరా బుజ్జినాన్నలూ...

"జ్యోతి నిక్కడికి రమ్మని చెప్పాను. ఈసరికి వస్తూవుంటుంది. ప్రేమ భారతంలో పదహారో పర్వం చెప్పాలివ్వాళ నేను. ఇంకెంత?... మరో రెండు పర్వాలు టకటకా చెప్పేస్తే తర్వాత మనంతా కలిసి శృంగార నైషధం మననం చేసుకోవచ్చు తీరిగ్గా. వెళ్ళండిరా బాబూ..."

మెడ ముందుకు సాచి చూపిన జ్యోతికి, వెనుదిరిగి వెళ్ళిపోతున్న ఇద్దరు యువకులు కనిపించారు. ఒకప్పుడు ఆమె ప్రేమించదగ్గవారుగా భావించిన ముగ్గురిలోనూ మిగిలిన ఇద్దరే వాళ్ళు!

ఆమె మనసంతా వికలమైంది. తన తల్లి నిత్యమూ చెప్పే జాగ్రత్తల విలువ, ఒక్క త్రుటిలో తనకు తప్పిపోయిన ప్రమాదం గుర్తొచ్చి ఏడుపొచ్చిందామెకు. ఆ ఏడుపు ఆవేశంగా మారింది కాస్సేపటికి. ఆవేశం దిగాక ఆమె మనసు తేలికపడింది.

కిషోర్ కంటపడకుండా యింటికి చేరుకున్న ఆమెకు, గుమ్మంలో నిలబడి ఉన్న సురేంద్ర కనిపించాడు.

'ఆడది చనువుగా మాట్లాడితే వీలైనంత త్వరగా ఆ చనువును ఎన్‌కేష్ చేసుకుందామనుకునే మగవాళ్ళు కోకొల్లలుగా ఉన్న సమాజంలో — ఆడదాని ప్రేమను ప్రేమగా గుర్తించి దాన్ని పెళ్ళివరకూ తీసుకువెళ్ళిన సురేంద్ర లాంటి

మగవాళ్ళను చేతనైతే అభినందించాలి; లేకపోతే...లేకపోతే;...' ఆ తర్వాత ఆమె మనసులో కలిగిన ఆలోచన ఆమెను ఉలిక్కిపడేలా చేసింది.

తన ఆలోచన అమలులో పెట్టే అవకాశం నెలరోజుల తర్వాత వచ్చింది ఆమెకు.

* * *

పౌరాణిక సినిమాలు బొత్తిగా కరువైపోయిన యీ రోజుల్లో, చాలా కాలానికి విడుదలైన ఆ బాపతు ఒకానొక సినిమా చూసేందుకు జ్యోతితల్లి సుభద్రమ్మ లీలావతితో కలిసి ఇల్లొదిలే సమయానికి, ఎన్నడూ ఆ సమయంలో రాని జ్యోతి, ఆరోజు అనుకోకుండా ఇంటికొచ్చింది కాలేజీ నుంచి.

భార్యతో సరసాలాడేందుకు తీవ్రమైన తలనొప్పితో బాధపడుతున్న వాడిలా మొహంపెట్టి వారానికోసారి ఆఫీసర్ని బ్రతిమాలి ఇంటి కొచ్చేయడం అలవాటైన సురేంద్ర ఆ సమయంలో వీధి మలుపు తిరిగాడు

తీరా ఇంటికొచ్చాక భార్య లేకపోవడంతో అతడికి నిజంగా తలనొప్పి వచ్చి అమృతాంజనాన్ని రెండు కణతలకూ పట్టించాడు. కాళ్ళూ, చేతులూ కడుక్కొని టీ తాగడంకోసం వంటింట్లోకి వెళ్ళబోయిన జ్యోతి ముక్కుపుటాలకు ఆ వాసన సోకడంతో, పక్కపోర్షన్లోకి తొంగి చూసి, ఓ అరగ్లాసు నీళ్లూ, మరో అర గ్లాసు పాలూ కలిపి స్టౌమీద పడేసి తల్లి తనకోసం కాచి ఉంచిన టీని ఫ్లాస్క్‌తో సహా తీసుకొచ్చి అతడి ముందుంచింది.

'ఆరే ఎందుకూ?'లాంటి మొహమాటం ప్రశ్నలేమీ వేయకుండా ఆమె అందించిన టీని చప్పరించడం పూర్తి అయ్యేసరికి అతడి తలనొప్పి అమృతాంజనం పేపర్‌తో కలిసి గాల్లో కెగిరిపోయింది.

అయిదు నిముషాల తర్వాత అతడి గదిలోకి వచ్చిందామె. అతడి అనుమతితో నిమిత్తం లేకుండా ఆ గదిలో ఉన్న కుర్చీలో కూర్చొని అంది జ్యోతి, "మీ కభ్యంతరం లేకపోతే కాస్సేపు మీతో మాట్లాడాలని ఉంది నాకు."

ఉపోద్ఘాతం లేకుండా ఆమె అలా మాట్లాడడం అతడి కాశ్చర్యాన్ని కలిగించినా, ఆమెవైపోసారి చూసి నవ్వాడు 'ప్రోసీడ్' అన్నట్టుగా.

"మీరూ లీలావతిగారూ ప్రేమించుకున్నారట కదా పెళ్ళికి ముందు?..." అని ఆగింది జ్యోతి.

'అయితే ఏమంటా'వన్నట్టుగా చూశాడామెవైపు సురేంద్ర. 'కొంపదీసి తన ప్రేమకథ చెప్పమనదు కదా ఈ పిల్ల?' అనుకున్నాడు కూడా. కానీ తన ఊహకు భిన్నంగా ఆమె అడిగిన ప్రశ్నకేం సమాధానం చెప్పాలో తోచలేదతడికి వెంటనే.

"నాకూ మీలానే ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనుంది. కానీ ఎవర్ని ప్రేమిం

చాలో తెలియడంలేదు. మీకూ పెళ్ళయిపోయినా ఎందుకో మిమ్మల్నే ప్రేమించాలని ఉంది నాకు. మీ కభ్యంతరమైతే చెప్పండి మిమ్మల్ని మళ్ళీ ఆ విషయం అడగను" అందామె.

ఇదేంవిటి? ఎవరైనా ఎదుటివాళ్ళనడిగి ప్రేమిస్తారా? అందునా తనలాంటి పెళ్ళయినవాణ్ని! 'నీకు దేహమంటే ఎదిగింది గానీ నీ ఆలోచనలు మాత్రం నీ వయసుకు తగ్గట్టే ఉన్నాయి' అనుకుంటున్నాడు మనసులో. ఆమె అవయవాల్లో ప్రౌఢత్వం. కళ్ళలో అమాయకత్వం మరింత కొట్టొచ్చినట్టుగా కనిపించాయి అతడికి.

"ఏవిటి అలా చూస్తున్నారు నా వైపు?" అంటూ జారిన వోణీనోసారి సవరించుకుందామె. అప్పుడామె కళ్ళలో కవ్వింపు కనబడడంతో, కావాలనే ఆమె వోణీని జార్చి సరిచేసుకున్నట్టుగా అనిపించిందతడికి.

ఆడది కవ్విస్తే మామూలుగా ఉండే వాణ్ని మగవాడని ఎలా అనగలం? ఆఫ్టరాల్ ఓ పెళ్ళికాని అమ్మాయికి-ఆమె అమాయకురాలే కావచ్చుగాక-తన మగతనాన్ని నిరూపించే అవకాశం యిచ్చేందుకు సురేంద్ర ప్రవరాఖ్యుడేమీ కాదు అందుకే తన సమాధానాన్ని కళ్ళ ద్వారా వ్యక్తంచేశాడు కాంతరూపంలో.

అగ్నిలో ఆజ్యం పోస్తున్నట్టుగా అంది జ్యోతి- "నన్ను పెళ్ళిచేసుకోమని మిమ్మల్ని వేధించను. నా క్కావల్సింది మీరు నన్ను ప్రేమించడం. అంతే!"

మగాడికి, అందునా సురేంద్రలాంటి వివాహితుడి కింతకంటే కావాల్సిందేముంది? ప్రేమకూ, కామానికీ మధ్య నున్న సున్నితమైన గీత అతడి మనసు లోంచి చెరిగిపోయి చాలా సేపైంది.

"థాంక్యూ... మీ మనస్సు తెలిసింది. ఈ సందర్భంలో నాకోమాటివ్వాలి మీరు. నా స్నేహితురాలొకర్తె ఉంది. దానికీ ఇదే గోల! ప్రేమించిన వాణ్నే పెళ్ళి చేసుకుని తీరాలనే కోరిక దానికి లేకపోయినా పెళ్ళికి ముందు ప్రేమ రుచి ఎలా ఉంటుందో తెలుసుకోవాలనుంది దానికీ నాలానే. అసలు పెళ్ళయినవాళ్ళయితేనే బెటర్ అని సూచించిందీ అదే! కనుక నా కోసమైనా మీరు దాన్ని కూడా ప్రేమించాలి." గోముగా చూస్తూ అంది జ్యోతి.

అప్పుడనుమానం వచ్చిందతడికి - ఆమె తనతో జోక్ చేస్తోందేమోనని.

అతడి ముఖకవళికలు మారడం చూసి అంది జ్యోతి- "అదేంవిటి? మీ ముఖం అలా మారిపోయింది? మీ కిష్టంలేదా? లేకపోతే మనిషిని చూడకుండా ఎలా ప్రేమించాలా అని సందేహిస్తున్నారా? ఆ అనుమానమేమీ అక్కర్లేదు మీకు. అది నా కంటే అందంగా ఉంటుంది."

ఇంత బ్రతుకూ బ్రతికి ఇంటి వెనుక చచ్చినట్టు పదహారేళ్ళ పిల్లకు తనిలా

దొరికిపోవడం వేవిటీ? అనిపించిందతనికి.

"పోనీలెండి... దాని సంగతి మీ దగ్గర తెచ్చి మిమ్మల్ని చిన్నబుచ్చా నేమో? నన్నొక్కదాన్నే ప్రేమించండి చాలు. ఇప్పుడే మొదలుపెడదామా మన లవ్వు?" అంది జ్యోతి అతడి భుజంమీద చేయివేసి కళ్ళలోకి కాంక్షగా చూస్తూ

ఆమె చేతిని తప్పించే ప్రయత్నం చేయకపోగా ఆమెను నమిలి తినేశాలా చూశాడు సురేంద్ర.

మరుక్షణంలో అతడి చూపులకు సమానమైన భావాలామె కళ్ళలో కని పించకపోగా ఆమె కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి.

ఒక్కక్షణం ఆగి అందామె. రెండు చేతులలోనూ చప్పట్లు కొడుతూ– "శహ భాష్! మీ ప్రేమ చాలా గొప్పది. మీ ప్రేమ చాలా గొప్పది. మీ అంగీకారాన్ని నోటితో చెప్పకపోయినా కళ్ళతో అద్భు తంగా వ్యక్తం చేశారు. కానీ నాదో అనుమానం– ఎంతమందికైనా చోటివ్వ గల పుష్పకవిమానం కాలూకు భాగాలే మైనా మీ మగవాళ్ళ హృదయాల్లో ఉన్నాయేమోనని.

"మొన్నామధ్య లీలావతిగారు మీ గురించి పొగుడుతోంటే ఆ పొగడ్తలో ఎంత బలముందో తెల్సుకుందుకు, నన్ను పెళ్ళి చేసుకోనక్కర్లేదనీ, ప్రేమిస్తే చాలనీ అడిగాను మిమ్మల్ని. నా అంచనా తప్పలేదు. ఎంతమందినైనా ప్రేమించ గల విశాల హృదయం మీకుందని నా కర్థమైంది."

ఆమె వెదడు. దేహంతో సమానం గానే ఎదిగిందనే విషయం అప్పుడర్థ మైందతడికి. కానీ అంత లేతవయసు లోనే ఆమె మనసలా ఎదగడానికి కారణం. తనలాంటి కోడేళ్ళనే విష యంతోపాటు తన వయసుకు తగ్గట్టుగా తన మనసెదగలేదనే విషయం మాత్రం అతడికి స్ఫురించలేదు.

సురేంద్ర దంపతుల్ని చూసి అసూ యతో లేదా సహజమైన కోరికకు దాసు రాలై తనూ ప్రేమించి పెళ్లిచేసుకోవాలను కున్న జ్యోతి– కిషోర్‌తో తనకెదురైన అనుభవంతో మగాళ్ళమీద నమ్మకం కోల్పోయి. ఆఖరి అవకాశంగా తన ఇంట్లోనే ఉన్న ప్రేమికుల జంట నిజ మైన ప్రేమ ఎంతో తెలుసుకోవడం కోసం చేసిన ప్రయత్నంలో కూడా భంగ పడడంతో, సినిమా నుంచి తిరిగొచ్చిన తల్లితో చెప్పింది. "చదువై పోయాక నువ్వు చెప్పినట్టుగా బావనే చేసుకుంటా నమ్మా!" అని.